పోచారం ఇన్‌చార్జి కమిషనర్‌గా సాబేర్ అలీ



బాధ్యతలు తీసుకుంటున్న సాబేర్ అలీ

పోచారం: పోచారం పురపాలక సంఘ కమిషనర్‌గా పనిచేసిన పి.వేమనరెడ్డి శనివారం పదవీ విరమణ చేశారు. వెంటనే పోచారం పురపాలక సంఘ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఘట్‌కేసర్ పురపాలక సంఘ కమిషనర్ మహ్మద్ సాబేర్ అలీ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సాబేర్ అలీకి మున్సిపల్ సిబ్బంది స్వాగతం పలికారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు వినూత్నంగా ఆలోచనతో నూతన ఆవిష్కరణలు చేపట్టాలని, ఎంట్రప్రెన్యూర్‌గా ఎదగాలని మల్లారెడ్డి యూనివర్సిటీ చైర్మన్, ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో ఇన్నోవేషన్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ సమ్మిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి, యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు ఆవిష్కరించంలో, సాంకేతిక రంగంలో తమ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఇలాంటి సమ్మిట్‌లు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేక స్టాళ్లతో తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. యువత ఎంట్రప్రెన్యూర్‌గా ఎదగడానికి యూనివర్సిటీ అన్ని విధాలా కృషిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలను, అనుభవాలను పంచుకున్నారు. యూనివర్సిటీ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆంజనేయులు, డీన్ తయ్యాబా ఖతూన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమలు.. వ్యాధులపై... యుద్ధం చేస్తాం..!



- వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు
- ప్రజల సలహాలు, సూచనలను తప్పక పాటిస్తాం
- ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ సాబేర్‌అలీ
- ఫాగింగ్ చేయడం లేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన ప్రజలు
- 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన



ఘట్‌కేసర్: వర్షాల నేపథ్యంలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల నివారణ... ప్రజల సమస్యలపై పాలకులకు, ప్రజలకు మధ్య వారధిగా ఉన్న 'సాక్షి' మీడియా గ్రూప్ ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ అన్నారు. శనివారం మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా ఆయన ప్రజలతో మాట్లాడారు. వారి సలహాలు, సూచనలు తీసుకొని చాలా సమస్యలకు అప్పటికప్పుడే పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ప్రజల సమస్యల పట్ల తమ వంతు సామాజిక బాధ్యతగా 'సాక్షి' దినపత్రిక సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, మున్సిపాలిటీలో సమస్యల గురించి ప్రజలతో నేరుగా అధికారులకు ఫోన్ చేయించడం మంచి కార్యక్రమం అని కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. ఫోన్ ఇన్‌లో ప్రజల తమ దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

ఫోన్ ఇన్‌లో కమిషనర్ దృష్టికి ప్రజలు తీసుకొచ్చిన సమస్యలకు ఆయన చూపిన పరిష్కారాలు ఈ విధంగా ఉన్నాయి.

- ఎస్‌బీఐ వెనుక రోడ్డుపై వర్షపు నీరు నిలవడంతో ఆ ప్రాంతం బురదమయమై ఇబ్బంది పడుతున్నాం.
  – నర్సింహారెడ్డి, ఐదో వార్డు సాయినగర్

కమిషనర్: నీరు నిల్వకుండా పక్కా ప్రణాళికతో సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం.

- బాలాజీనగర్‌లో కొంత మంది చెత్తను చెత్త సేకరణ వాహనంలో వేయకుండా ఎక్కడ పడితే అక్కడే వేస్తున్నారు. దీంతో దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు వ్యాపిస్తున్నాయి.
  – రాజేందర్‌రెడ్డి, బలాజీనగర్

కమిషనర్: చెత్తను తడి పొడిగా వేరుచేసి చెత్త సేకరణ వాహనంలో వేసేలా అవగాహన కల్పిస్తాం. అయినా వినని పక్షంలో జరిమానా విధిస్తాం.

- టీచర్స్ కాలనీ, సాయినగర్ కాలనీలో ఖాళీ ప్రదేశాలు, ప్లాట్లలో ఉన్న చెట్లు, పొదలను తొలగించండి.
  – మేడబోయిన నరేశ్, టీచర్స్ కాలనీ, సాత్విక్ సాయినగర్

కమిషనర్: మున్సిపాలిటీ సిబ్బందితో చెట్లను లేకుండా చేయిస్తాం. ఖాళీ ప్రదేశాల యజమానులకు సమాచారమిచ్చి శుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తాం.

- సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో చెత్తాచెదారం ఎక్కువగా పేరుకుపోతోంది. దీంతో ఇంటింటా డెంగీ తదితర జ్వరాలు వ్యాపిస్తున్నాయి.
  – రాజేశ్వరి, నారాయణ

కమిషనర్: మున్సిపల్ సిబ్బందితో సమస్యను పరిష్కరిస్తాం.

- ఎన్‌ఎఫ్‌సీనగర్, బ్రూక్‌బాండ్ కాలనీలో ఫాగింగ్ చేయడం లేదు. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి.
  – రామతీర్థ, 14వ వార్డు, ఏపీ రెడ్డి, ఎన్‌ఎఫ్‌సీనగర్

కమిషనర్: దోమల నివారణకు తప్పకుండా ఫాగింగ్ చేయిస్తాం.

- డెంగీ జ్వరాలపై అవగాహన కల్పించండి.
  – హనుమాన్, పదో వార్డు

కమిషనర్: స్కూల్ విద్యార్థులతో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు చేపట్టాం, ప్రజల సాయంతో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తాం.

- ఎన్‌ఎఫ్‌సీనగర్ చౌరస్తాలోని పార్కులో పిచ్చి మొక్కలు, పొదలు బాగా పెరిగాయి.
  – సుధాకర్‌రెడ్డి, ఎన్‌ఎఫ్‌సీనగర్

కమిషనర్: పార్కులోని పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రం చేయిస్తాం.

- ఎన్‌ఎఫ్‌సీనగర్ కేంద్రీయ విద్యాలయం దగ్గర రోడ్డుపై చెత్త ఉంటుంది, దోమల మందు చల్లడం లేదు.
  – మహిపాల్‌రెడ్డి, చందుపట్లగూడ

కమిషనర్: పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తను తొలగించి పరిశుభ్రం చేయిస్తాం. ప్రజలు కూడా సహకరించాలి.

- టర్నింగ్ పాయింట్ హోటల్ పక్క వీధిలో బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారు.
  – ప్రణయ్, ఐదో వార్డు

కమిషనర్: మూత్ర విసర్జన చేయొద్దని బోర్డు నాటించి నివారణ చర్యలు చేపడతాం.

- కొండాపూర్ మొదటి వార్డులో దోమల మందు చల్లమంటే లేవంటున్నారు.
  – వెంకటేశ్వర్‌రావు ఒకటో వార్డు

కమిషనర్: బ్లీచింగ్ పౌడర్, పినాయల్ అందుబాటులోనే ఉన్నాయి. చల్లిస్తాం.

- జవహర్‌నగర్ డంపింగ్ యార్డు నుంచి వచ్చే కలుషిత నీరు ఎరిమల్లె వాగులో కలుస్తున్నాయి.
  – ప్రతాపరెడ్డి, సాయినగర్ ఐదో వార్డు

కమిషనర్: ఇరిగేషన్ అధికారుల చర్చించి సమన్వయంతో పరిష్కరిస్తాం.

- ఈడబ్ల్యూఎస్ కాలనీ సమీపంలో బహిరంగ మల, మూత్ర విసర్జన చేస్తున్నారు.
  – పంతులు, ఈడబ్ల్యూఎస్ కాలనీ

కమిషనర్: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి నివారణ చర్యలు తీసుకుంటాం.

- బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ దగ్గర దోమలు ఎక్కువగా ఉన్నాయి. ఇంటింకో డెంగీ కేసు నమోదు అవుతున్నది.
  – ఎం.రమేశ్

కమిషనర్: ఇంటి ఆవరణ, ఇళ్లపై వర్షపు నీరు నిల్వకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. బయట ప్రదేశాల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం.

రేపు తూంకుంట మున్సిపల్ కమిషనర్‌తో...

'సాక్షి' ఫోన్ ఇన్



ఆర్.వెంకటగోపాల్

శామీర్‌పేట: ఇటీవలికాలంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ఇతరత్రా వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా జ్వరాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటగోపాల్‌తో 'సాక్షి' దినపత్రిక ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నాము. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, తీసుకుంటున్న చర్యలపై ప్రజల ప్రశ్నలకు కమిషనర్ ఫోన్‌లో సమాధానాలు ఇస్తారు.

సమస్యల పరిష్కారం కోసం ఫోన్: 96669 22234 లో సంప్రదించవచ్చు.

అర్హులందరికీ 'సంక్షేమ' ఫలాలు



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకున్నామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో నాగారం పురపాలక సంఘం పరిధిలోని 80 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్, కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు సృష్టించే వారిగా ఎదగాలి

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు ఉద్యోగాలు చేసే వారిగా కాకుండా ఉద్యోగావకాశాలను సృష్టించే వారిగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందని మోటివేషనల్ స్పీకర్ గంప నాగేశ్వర్‌రావు అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఓరియెంటేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంజినీరింగ్ విద్యలో ఏ బ్రాంచ్ ఎక్కువ, తక్కువ కాదంటూ ఆ విద్య గొప్పతనాన్ని వివరించారు. కళాశాల సెక్రటరీ టి.వి.రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ టెక్నికల్ కళాశాలలో...

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ కళాశాలలో నిర్వహించిన ఓరియెంటేషన్ డే కార్యక్రమంలో సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, కళాశాల కార్యదర్శి వసంత లత, సీఈఓ అభినవ్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఐశ్వర్య, డైరెక్టర్ రాజిరెడ్డి, అలీబేగ్, కన్వీనర్ కేశవరెడ్డి, పీఆర్వో దుర్గాప్రసాద్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అలియాబాద్ పల్లె దవాఖానా సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం

శామీర్‌పేట మండలంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్ గౌతమ్



పల్లె దవాఖానాను సందర్శించిన కలెక్టర్ గౌతమ్

శామీర్‌పేట: శామీర్‌పేట మండలం అలియాబాద్‌లోని పల్లె దవాఖానాలో రికార్డుల నమోదు సరిగా లేవని సిబ్బందిపై మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం శామీర్‌పేట మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ముందుగా మండలంలోని అలియాబాద్ పల్లె దవాఖానాను ఆయన సందర్శించారు. మందుల పంపిణీ రికార్డుల పంపిణీ, వైద్య సేవల రిజిస్టర్‌లు గడచిన నాలుగు నెలలుగా నమోదు సరిగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓపీ పేషెంట్ల సంఖ్య పెంచేలా ఆశ వర్కర్లు ఇంటింటికీ తిరిగుతూ అవగాహన కల్పించాలని సూచించారు. ఈడీడీ కేలండర్, వంద కాలమ్ రిజిస్టర్‌ను తప్పని సరిగా నిర్వహించాలని సిబ్బందికి కలెక్టర్ సూచించారు. అనంతరం శామీర్‌పేటలోని సామాజిక అరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారంలో సుమారు 15 వందల ర్యాపిడ్ కిట్లను వినియోగించాలని వైద్యులకు సూచించారు. లేబర్ రూమ్‌ను పరిశీలించి హైడ్రాలిక్ డెలివరీ టేబుల్‌ను తెప్పించుకోవాలని, అందుకు అవసరమైన నిధుల కోసం నివేదిక అందజేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు.

గురుకుల పాఠశాల సందర్శన...

శామీర్‌పేటలోని అమీనా ఇంజినీరింగ్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌ను కలెక్టర్ గౌతమ్ సందర్శించారు. విద్యార్థుల సంఖ్యతోపాటు భోజన వసతి, మౌలిక వసతులను తెలుసుకున్నారు. భోజనశాలకు వెళ్లే దారికి మరమతులు చేపట్టి, అందుకయ్యే నగదును భవన యజామానికి ఇచ్చే అద్దె నుంచి దశలవారీగా మినహాయించాలని ఆదేశించారు. అనంతరం స్టోర్ రూం, వంటగదిని పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ రఘునాథస్వామి, శామీర్‌పేట ఎంపీడీఓ మమతాబాయి, ఆస్పత్రి వైద్యులు, రెసిడెన్షియల్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే వంతెన పనుల పరిశీలన

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవరెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌గౌడ్, ఎఫ్‌ఎస్‌సీఎఫ్ మాజీ చైర్మన్ ఎస్.శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎమ్మెల్యే మల్లారెడ్డి సహకారంతో రైల్వే వంతెన పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, సిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గాలిగోపుర నిర్మాణానికి శంకుస్థాపన

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం, ఉద్దమర్రి గ్రామంలోని అక్కన్న మాదన్నల కాలం నాటి వేంకటేశ్వర, శ్రీ విష్ణు శివాలయానికి ముఖద్వార గాలిగోపుర నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిత

మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్: యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే ఉన్నత లక్ష్యాలను చేరుకొని ఉజ్వల భవిష్యత్‌ను సొంతం చేసుకోగలుగుతారని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన స్ఫూర్తి జూనియర్ కళాశాల ఫ్రెషర్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... యువత చెడు వ్యసనాలకు బానిసలై తమ అందమైన భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యుక్త వయస్సులో చెడు దారిలో నడవకుండా తమ భవిష్యత్ కోసం చదువుల్లో రాణించి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. యువత ఫోన్‌కు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, కళాశాల ప్రతినిధులు సూర్యనారాయణమూర్తి, కమలాకర్‌రెడ్డి, దేవరాజ్, గణేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

కుషాయిగూడ ఏసీపీ మహేష్



మాట్లాడుతున్న కుషాయిగూడ ఏసీపీ మహేష్

జవహర్‌నగర్: వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌వో నాగరాజు ఆధ్వర్యంలో శనివారం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మద్దూరి స్వరూప గార్డెన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కుషాయిగూడ ఏసీపీ మహేష్ మాట్లాడుతూ... మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి భూగర్భ జలాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వినాయక ఉత్సవ నిర్వాహకులు ఆన్‌లైన్‌లో తప్పనిసరి దరఖాస్తు చేసుకోవాలని, ప్రతి మండపానికి జియో ట్యాగింగ్ తప్పనిసరి చేస్తామన్నారు. రోడ్లపై మండపాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సంప్రదాయబద్ధంగా.. ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ... ప్రతి మండపంలో రాత్రి సమయంలో నిర్వాహకులు తప్పక ఉండాలన్నారు. జవహర్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌గౌడ్, ఎస్‌ఐలు ఇద్రీస్‌అలీ, రామునాయక్, వేణుమాధవ్, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్ ప్రణీత, కమిషనర్ నాగరాణి, జవహర్‌నగర్ కార్పొరేషన్ మేనేజర్ నగేష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, కాప్రా గణేష్ ఉత్సవ కమిటీ నాయకులు సతీష్‌గౌడ్, ప్రభాకర్, నాయకులు సతీష్‌గౌడ్, పాషామియా, వినయ్‌కుమార్, భాస్కర్, కాప్రా, జవహర్‌నగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీఐ రాచకొండ బాబుకు ఉద్యోగ విరమణ వీడ్కోలు



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్ రవాణా శాఖలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రాచకొండ బాబు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా మేడ్చల్ డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ రఘునందన్‌గౌడ్‌తో పాటు పలువురు ఆయనను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఏఓ రామకృష్ణ, ఇఫ్తికర్ ఉద్దీన్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ సాదుల శ్రీనివాస్, శిల్పా, అసిస్టెంట్ మోటార్ వెహికల్ త్రివేణి భాయ్, సీనియర్ అసిస్టెంట్ రమేష్, జూనియర్ అసిస్టెంట్ జగదీష్, సాయి, ప్రణయ, కానిస్టేబుల్స్ గంగాధర్, శ్రీకాంత్‌రెడ్డి, జంగయ్య, గణేష్, రవీందర్, ఆఫీస్ సిబ్బంది, హోమ్‌గార్డ్స్ వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

మట్టి గణపయ్యలనే పూజించాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మట్టి వినాయకుడి విగ్రహాలనే నెలకొల్పాలంటూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయక చవితి పర్వదినాన ప్రతి ఒక్కరూ మట్టి గణపయ్యనే ప్రతిష్టించి పూజించాలని, పీఓపీ విగ్రహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పాఠశాల విద్యార్థుల చేత మట్టి గణనాథులను చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శంకరయ్య, ఉపాధ్యాయులు మధుసుదన్‌రెడ్డి, సాయప్ప, శేఖర్, రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులను చెరబడుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు!



ధ్వంసమైన నాడెం చెరువు తూమును పరిశీలిస్తున్న వజ్రేశ్‌యాదవ్ తదితరులు

- నాడెం చెరువు తూము ధ్వంసం దారుణం
- ధ్వంసం చేసిన వారిపై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తాం
- టీ పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లాలోని చెరువులు, కుంటలను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి చెరబడుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర జంగయ్యయాదవ్ ఆరోపించారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన నాడెం చెరువు తూమును కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... బఫర్ జోన్ విస్తీర్ణం తగ్గి తమ నిర్మాణాలకు సమస్య తలెత్తకుండ ఉండాలనే కావాలనే అనురాగ్ విద్యాసంస్థల యాజమాన్యం చెరువు తూమును ధ్వంసం చేయించారని ఆరోపించారు. న్యాయస్థానంలో పల్లాకు చుక్కెదురు కావడంతో చెరువు నిండి తమ నిర్మాణాల వరకు నీరు చేరడంతో రాత్రికి రాత్రే తూమును ధ్వంసం చేశారన్నారు. తమ కోసం జాతీయ రహదారి నుంచి వెంకటాపూర్ గ్రామం వరకు 200 మీటర్ల రోడ్డును తగ్గించడంతో గ్రామస్తులకు ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. తూమును ధ్వసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రుణ లక్ష్యం ఖరారు


- బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం రూ. 197 కోట్లు
- ఇప్పటికీ పంపిణీ చేసిన రుణాలు రూ. 11 కోట్లు
- గతేడాది లింకేజీ కింద సాధించిన రుణ లక్ష్యం ప్రగతి 118 శాతం
- స్త్రీ నిధి రుణ లక్ష్యం రూ. 19 కోట్లు
- ఈ ఏడాదిలో సంఘాలకు రుణ లక్ష్యంపై డీఆర్‌డీఏ ప్రణాళిక



సాక్షి, సిటీబ్యూరో: మహిళా సంఘాలకు ప్రభుత్వం 2024–25వ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ రుణలక్ష్యాన్ని నిర్దేశించింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ఐదు మండలాల్లో 3,390 సంఘాలకు రూ. 197 కోట్ల లింకేజీ రుణాన్ని మంజూరిచ్చేలా ప్రణాళికను రూపొందించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 3,383 మహిళా సంఘాలకు రూ. 164.20 కోట్లకు గాను నిర్దేశిత లక్ష్యాన్నిదాటి రూ. 194.56 కోట్ల (118.48 శాతం) రుణాలను పంపిణీ చేయటంతోపాటు రికవరీలోనూ ప్రగతిని సాధించారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ నిర్దేశిత రుణ లక్ష్యాన్ని పూర్తిచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

- ఇప్పటి వరకు రూ. 11 కోట్ల రుణాలకు సంబంధిత మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు వెల్లడించారు. ఇదివరకు ప్రభుత్వం ద్వారా రుణాలను తీసుకున్న వారందరూ తమ ఆదాయాన్ని అభివృద్ధి చేసుకునేలా నూనెలు, కిరాణాలు, పప్పుల మిల్లులు, ఇతరత్రా ఉప ఉత్పత్తుల తయారీలో భాగంగా భిన్నమైన యూనిట్లను నెలకొల్పుకున్నారు.
- మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్నట్లు డీఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి. మరోవైపు మహిళా సంఘాలు చెల్లించిన వడ్డీని ప్రభుత్వం తిరిగి సంఘాల ఖాతాలో జమచేయాల్సి ఉండగా... దాదాపు మూడేళ్లవడ్డీ పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వడ్డీ చెల్లిస్తామని, వడ్డీ లేని రుణ పథకాన్ని చేపడతామన్న కొత్త ప్రభుత్వం ప్రకటన అమలుతో మహిళా సంఘాలు మరింతగా బలోపేతం కావటంతో పాటు ప్రోత్సాహకరంగా ఉండనున్నట్లు డీఆర్‌డీఏ పేర్కొంటోంది.
- స్త్రీ నిధి కింద మహిళా సంఘాలకు రుణ లక్ష్యం రూ. 19 కోట్లు అందజేసేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. గతేడాది స్త్రీ నిధి కింద స్వయం సహాయక సంఘాలకు రుణ లక్ష్యం రూ. 15.01 కోట్లు కాగా, రూ. 15.48 కోట్లు(102.17 శాతం) పంపిణీ చేశారు. లక్ష్యానికి మించి ప్రగతి సాధించటంతో ఈ ఏడాది రుణ లక్ష్యాన్ని రూ. 19 కోట్లకు పెంచినట్లు డీఆర్డీఏ వర్గాలు పేర్కొంటున్నాయి.

సీఎంఆర్‌టీసీలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



సదస్సు సావినార్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ కళాశాలలో ఇంటెలిజెంట్ కంప్యూటింగ్ అండ్ కమ్యూనికేషన్స్‌పై రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. పలు దేశాలకు చెందిన ప్రతినిధులతో పాటు దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన యూనివర్సిటీ ప్రొఫెసర్లు, జేఎన్‌టీయూహెచ్ ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సదస్సు సావినార్‌ను ఆవిష్కరించారు. కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి, సెక్రటరీ వసంతలత, డైరెక్టర్ రాజిరెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ కమిషనర్‌గా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



జవహర్‌నగర్: జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా ప్రవీణ్ కుమార్‌రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు కమిషనర్‌గా పనిచేసిన తాజ్‌మోహన్‌రెడ్డి శనివారం పదవీ విరమణ చేయగా నూతన కమిషనర్‌గా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఆర్వో ప్రభాకర్‌యాదవ్, మేనేజర్ నగేష్, మున్సిపల్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.